# ఎయిర్ కూలర్

ఆమె పేరు ఊర్మిళ. రామాయణంలోని ఊర్మిళకు పద్నాలుగు సంవత్సరాలపాటు కుంభకర్ణసేవ చేసినట్టు ఒక చెడ్డ పేరుంది. కానీ, ఈ ఊర్మిళ అలాంటిదికాదు. నిద్రపోతుంది కానీ, రోజుల తరబడి నెలల తరబడి, సంవత్సరాల తరబడి కాదు.... కొన్ని గంటల పాటు మాత్రమే. కానీ, అది ఒళ్ళెరుగని నిద్ర. దానిని ఇంగ్లీషులో సౌండ్‌స్లీప్ అని అంటారు. సౌండ్ అంటే శబ్దం, స్లీప్ అంటే నిద్ర. అంతవరకూ అక్షరాలా నిజమే. ఊర్మిళ నిద్రకు తోడుగా ఒక శబ్ద విశేషం ఉంటుంది. అయ్యో! ఒక శబ్ద విశేషమేనా! అదే అయితే, అంత పెద్ద సమస్య లేదుగా. ఆమె గురక నాలుగైదు రకాల శబ్ద సమ్మేళనం. ఆ శబ్దాల మధ్య సరియైన స్వరాల పొందిక కూడా ఉండదు. ఆ శబ్దాలకి ఆరోహణా అవరోహణా క్రమాలేవీ లేవు. ఏకతాళం, త్రిపుట తాళం, ఆట తాళం, పిట తాళం లాంటి తాళాలకేమీ కూడా ఆ గురక పరిమితం కాదు. దాని తాళం ఒక మిశ్రతాళం. అంటే ఒక అవియల్‌తాళం. తాళమేదయినా కానీ, ఆ గురకకి అప్పుడప్పుడు గేర్ ఛేంజ్ అవుతుంది. గురక ప్రథమ పాదంలో ఒక లారీ నిండులోడుతో కష్టపడి ఘాట్ ఎక్కుతున్నట్టుంటే, లోడేమీ లేకుండా ఒక పాతలారీ తారులేని కంకర రోడ్డు మీద వెళ్ళేటప్పుడు వచ్చే శబ్దాలు రెండో పాదంలో వినవచ్చు. అతివేగంతో జలతలాన్ని చీలుస్తూ వెళ్ళే ఒక మోటారు బోటు శబ్దాన్ని తలపింపజేస్తుంది మూడోపాదం. ఎలక్ట్రిసిటీ గాని, డీజిల్ గాని వాడకుండా సాక్షాత్ బొగ్గును ఉపయోగించి, నీటిని ఆవిరి చేసి, ఆ ఆవిరి దేవుడి శక్తితో పొగబండిని ముందుకు నడిపించినప్పుడు వచ్చే శబ్ద సమ్మేళనాలు వినిపిస్తాయి నాలుగోపాదంలో. ఎటువంటి నాదకోలాహలంలోనైనా, బస్సు కానీ, లారీ కానీ, దాని పొగ గొట్టం నుంచి ఎక్కువ పొగ ఒకేసారి బయటికి వదిలేటప్పుడు వచ్చే "ఝూ" అనే విశేష శబ్దం లాంటిది ఆమె నవద్వారాలలో అతి ప్రధానమైన రెండు మూడు రంధ్రాల ద్వారా అప్పుడప్పుడు బయటికి వస్తుంది. మంద్రస్థాయి, మధ్యమస్థాయి, తారాస్థాయి కాక ఆమె గురకకి చంద్రస్థాయి అనే ప్రత్యేక స్థాయి కూడా ఉండేది. పున్నమినాడు కొందరికి పిచ్చెక్కుతుందని అంటారు కదా! అలాగే ఈమె చంద్రస్థాయి గురక వింటే ఆమె భర్తయైన కోదండరెడ్డికి పిచ్చెక్కుతుంది.

అది వారి మొదటి రాత్రేనా?

వారి మొదటిరాత్రి –ఊర్మిళ బి.పి.యల్. వారి డోర్ ఫ్రాస్ట్ ఫ్రీ ఫ్రిజ్‌లాగా సైలెంట్‌గా ఉండేది. అన్నట్టు, ఫోర్ డోర్ ఫ్రిజ్ చాలా పెద్ద సైజు కదా! అవును, ఒప్పుకుంటాను. కానీ,

ఊర్మిళ పరిమాణం దానికన్నా తక్కువేనా! అయిదడుగుల అయిదంగుళాల ఎత్తు, దానికి తగ్గ లావు ఉన్న ఆమెకి భీముడికే వంట చేసే శరీర సామర్థ్యం ఉన్నట్టే కదా! ఆమెని ఫ్రిజ్‌తో పోల్చడంలో దురుద్దేశ్యమేమయినా ఉందా? ఏమిటి ఆమె ఫ్రిజిడా? అయ్యో! అలా అపార్థం చేసుకోకండి. ఇద్దరు మగపిల్లలకి, ఇద్దరు ఆడపిల్లలకి, జన్మనిచ్చిన ఒక స్త్రీని "ఫ్రిజిడ్" అని వర్ణించే హక్కు ఆమె భర్తకి పరిమితం చేయడమే సమంజసం. "ఫ్రాస్ట్ ఫ్రీ" అని వర్ణించడంలో నిగూఢార్థమేదయినా ఉందా? లేదు. ఆడవాళ్ళందరూ ఫ్రాస్ట్‌ఫ్రీగానే ఉంటారు. మానవ శరీరంలో తొంబైశాతం వరకు జలాంశమేనని పిచ్చికుక్కలు తప్ప మిగతా అందరూ అంగీకరిస్తారు. మరి "ఫోర్‌డోర్స్" అని ఎందుకన్నారు? ప్రియమైన పాఠకుల్లారా! అడుగడుక్కీ ఇలా ప్రశ్నలు వేస్తుంటే నాకు కథ రాసే మూడే పోతుంది. ఇంతేనా? ఇంకా ఏమైనా ప్రశ్నలున్నాయా? బి.పి.యల్. అంటే ఏమిటని అడగరా?" భార్యని పోలిన లావణ్యవతి" అని చెపితే చాలా మంది భార్యలకు ఆ వర్ణన నచ్చుతుంది.

ఇంతకీ, చెప్పొచ్చేదేమిటంటే, మొదటిరాత్రి ఊర్మిళ చాలా సైలెంట్‌గా ఉన్నదని, ఒకవేళ, ఆమె గాఢనిద్రా సమయాన చిన్నగా ఏదయినా అపస్వరం వచ్చినా, ఆమె మొదటి వివాహపు మొదటిరాత్రి, మొదటి భర్త అయిన కోదండరెడ్డి ప్రతిస్పందన అనుకూలంగా ఉండటానికి వీల్లేదు. పాపం, ఈమె గత కొద్దిరోజులుగా నిద్రపోలేదేమో. తన ఆజానుబాహు వలయంలోని సురక్షిత భావన ఆస్వాదిస్తూ సర్వం మరచి, ఆమె ఒక చిన్నపాపలా, ఒక నిష్కళంక మూర్తిగా నిదురపోతోందని అతను భావిస్తాడు. లేకపోతే ఆమె జీవితంలో ఇదే మొదటిరాత్రి కావచ్చు. ఒక పురుషుడి బలం, ఆవేశం ఈమె మొదటిసారిగా రుచి చూసిందేమో... నేనంత తక్కువవాణ్ణేమీ కాదు గదా... పాపం, చాలా అలసిపోయి నిద్రపోతుందేమో! అని తనలో తాను గర్విస్తాడు.

"ఈమె తండ్రి గూర్ఖాలా పొట్టివాడు కదా! అందుకే అతని గూర్ఖా రక్తమేమయినా ఈమెలో కలిసిందేమో. అందుకే ఈమె గురక మొదలుపెట్టిందేమో!" అని కూడా అతను ఆలోచించి ఉండడు.

ఏమయినా కోదండరెడ్డికి, ఊర్మిళ నిద్రపట్ల ఎలాంటి కంప్లైంటు ఉండేది కాదు. వాళ్ళిద్దరూ కలిసి భోజనం చేయడంవలన, కలిసి నిద్రపోవడం వలన, వాళ్ళకు "నాకిద్దరు నీకిద్దరు" అనే స్కేలులో ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్ళు పుట్టారు. ఇద్దరమ్మాయిలూ అమెరికాలో పనిచేస్తున్న ఇంజనీర్స్‌ని పెళ్ళిచేసుకున్నారు. కొడుకుల్లో ఒకడు ఎయిర్‌ఫోర్స్‌లో ఆఫీసరుగా పనిచేస్తున్నాడు. రెండోవాడు చదువులో అంతగా రాణించకపోయినప్పటికి, ఎలాగో బి.కామ్. దాటి ఫ్రెండ్‌తో కలిసి రియల్ ఎస్టేట్ బిజినెస్ చేస్తున్నాడు.

నలుగురు పిల్లలకీ పెళ్ళిళ్ళు అయ్యాయి. ఆ రియల్ ఎస్టేట్ కొడుకు తల్లీ తండ్రీ దగ్గరే ఉంటున్నాడు.

నలుగురు పిల్లలకీ మంచి చదువులు చెప్పించి, పెద్దవాళ్ళని చెయ్యాలంటే, ఊర్మిళ–కోదండ దంపతులకు బాగానే ఖర్చు అయి ఉంటుంది. వాళ్ళ ఆర్థిక పరిస్థితి కూడా బాగానే ఉండి ఉండాలి.

నిజానికి బాగా లేదు. వారికి నలుగురు పిల్లలు కావాలని ఉండేది కాదు. వివాహానంతర సప్తవసంతాలలోపల, ఇద్దరు మగపిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు. ఒక క్యూ నుంచి వచ్చినట్లు, బయటపడ్డారు. తమ కాస్ట్లీ మిస్టేక్ తెలుసుకునేసరికి చాలా లేటయిపోయింది. పుట్టేసిన పిల్లలకి ఫ్యామిలీ ప్లానింగ్ వర్తించదు కదా! అందుకే ఆ పిల్లలకు తమ శక్తి సామర్థ్యాలన్నింటినీ వెచ్చించి, మంచి చదువులు చెప్పించాలని స్నేహ విధులైన ఆ తల్లిదండ్రులు సిద్ధపడ్డారు. పెళ్లినాటికి, కోదండరెడ్డి రోడ్స్ అండ్ బిల్డింగ్స్ విభాగంలో జూనియర్ ఇంజనీర్. నలుగురు పిల్లల భాగ్యజాతకాల కారణంగా అతను అసిస్టెంట్ ఇంజనీర్ కాగలిగాడు. అతి కష్టంతో నలుగురికీ ఇంగ్లీష్ మీడియంలో చదువులు చెప్పించాడు. వారి వివాహాలు కూడా జరిపించేసరికి, కోదండరెడ్డి వయసు యాభై అయిదు. ఊర్మిళ వయస్సు యాభై. ఈ లోపల రెడ్డిగారు, మెయిన్‌రోడ్డు మీద తనకొక స్వంత యిల్లు కూడా కట్టుకొన్నారు. ఇద్దరాడపిల్లల పెళ్ళిళ్ళకి దొరికిన చోటల్లా అప్పులు చేసినా కానీ, మగపిల్లలిద్దరి పెళ్ళిళ్ళతో ఆ అప్పులు కూడా తీరిపోయాయి.

ప్రస్తుతం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా వచ్చే జీతంతో ఒక మోస్తరుగా ఆ కోదండ కుటుంబం సాఫీగా జీవితం గడుపుతున్నారు. చిన్న కొడుకూ, కోడలూ, ఆ ఇంట్లోనే ఉంటారు కానీ, వాళ్ళకై తాము ప్రత్యేకంగా ఖర్చుపెట్టే అవసరం లేదు. పైపెచ్చు వాళ్ళవల్లే చిల్లర మల్లర ఖర్చులు గడిచిపోతుండేవి. అందుకు తోడు ఎగ్జిక్యూటివ్ హోదాలో ఒక ప్రభుత్వ జీపు అమరడంవలన, బస్సు చార్జీలు, ఆటో ఖర్చులు కూడా తప్పాయి. అదీగాక, చిన్న కోడలుతో పాటు చిన్న మారుతీ కారు కూడా గృహప్రవేశం చేసింది.

ఈ విధంగా రిటైర్మెంట్‌కు మూడు సంవత్సరాల కాలం మిగిలున్నప్పుడు....

ఆ గురక కాండం మొదలైంది. కాండమంటే చెట్టు కాండం కాదు, ఒక కొత్త అధ్యాయమన్నమాట. ఒక నూతన పర్వమన్నమాట.

"ఊర్మిళా! నేను సరిగ్గా నిద్రపోయి నాలుగు రోజులైంది. నీ గురకని పూర్తిగా ఆపలేకపోయినా దాని శబ్దం కాస్తం తగ్గించకూడదా" అని దయనీయమైన స్వరంతో అడగకుండా ఉండలేకపోయాడు కోదండం.

"ఏమిటీ? నేను గురక పెడుతున్నానా? గత ముప్పై సంవత్సరాలలో మీరెప్పుడూ అటువంటి కంప్లైంట్ చేయలేదే! కానీ, అప్పుడప్పుడు మీరు భలే గురక పెడతారు. అది కూడా బాగా తాగి వచ్చినప్పుడు. కానీ, మిమ్మల్ని పక్కకి వత్తిగిలిస్తే ఆ గురక ఆగిపోతుంది. కానీ, నాకలాంటి జబ్బేమీ లేదు. ఎప్పుడో ఒకసారి జలుబుచేసి, ముక్కు దిబ్బడేసినప్పుడు, కాస్త శబ్దం రావచ్చు. దాన్ని గురక అని పిలవక్కరలేదు."

"అది కాదు ఊర్మిళా, పోయిన వారం నుంచి నీ గురక ఆగకుండా సాగుతుంది. విపరీతమైన శబ్దం కూడా. నిన్ను అటూ, ఇటూ కదిలించి లేపి చూశాను. నీకు ఒళ్ళు తెలియలేదు. సుఖంగా నిద్రపోవడం మంచి ఆరోగ్య లక్షణమే. దేవుడి దయవలన నీకు మంచి ఆరోగ్యం ఉంది. కానీ, ఇది ఇలాగే కొనసాగితే నా ఆరోగ్యం సంగతేంటి? నిన్న రాత్రి నాకు పిచ్చెక్కినట్టయ్యింది."

"ఓహ్! పిచ్చెక్కడానికి మీకు ప్రత్యేకంగా రాత్రిళ్ళే కావాలని లేదే"

"ఊర్మిళా! ఇది తమాషా కాదు, నేను చాలా సీరియస్‌గా చెబుతున్నాను. రాత్రిళ్ళు నిద్రలేకుండా ఇలా గడపడం నా వల్లకాదు."

"దీన్ని పెద్ద సమస్యగా చేయొద్దు. నేను వేరేగదిలో పడుకుంటాను."

"కానీ, ఊర్మిళా! నువ్వు నా దగ్గర లేకపోతే నాకు నిద్ర వస్తుందని అనుకుంటున్నావా?"

"ఇది మరీ బాగుంది. నేను దగ్గరున్నా మీకు నిద్రరాదు. దూరంగా ఉన్నా నిద్రర్రాదు. ఇక, నన్నేం చేయమంటారు?"

"నువ్వు కొంచెం ప్రయత్నించి చూడు. కొంచెం సెల్ఫ్ కంట్రోల్ ఉంటే, గురకని కాస్త తగ్గించవచ్చు. మెలకువగా ఉన్నప్పుడే కాదు, నిద్రపోతున్నప్పుడు కూడా కొద్దిగా సెల్ఫ్ కంట్రోల్ ఉండాలి."

"అది జరిగేపని అని నాకు అనిపించటంలేదు. నిజంగా నేను ఎక్కువగా గురక పెడుతున్నానని అంటే, మీరు ఒక డాక్టరుని సంప్రదించకూడదా? అతనేదయినా పరిష్కారం చూపిస్తాడు."

"ఛీ. ఛీ! నేను డాక్టరుని కలిసి నా భార్య గురక కారణంగా నాకు నిద్రపట్టడంలేదని ఎలా చెప్పమంటావు?"

"అయ్యో! మీకా మాత్రం జ్ఞానం లేదా? డాక్టరుని కలిసినప్పుడు మీ గురకవలన నాకు నిద్ర పట్టడం లేదని చెప్పకూడదా!"

"డాక్టరు నా ముక్కుని పరీక్షించి, చిన్న ఆపరేషన్ చేయాలని చెపితే? అయినా, నాకు తెలిసినంతవరకు గురకకి మందులేవీ లేవు."

"ఒకసారి అడిగి చూడడంలో మీకేమిటి అభ్యంతరం?"

ఇటువంటి వాగ్వివాదాలు తరుచుగా వారి మధ్య చోటు చేసుకునేవి. ఈ ప్రకారమైన సంభాషణా తీక్షణత వలన ఊర్మిళ విడాకులకి సిద్ధపడే స్థాయికి వచ్చింది. అప్పుడప్పుడూ ఆమె గురక శబ్దం కాస్త తగ్గినట్టు ఆయనకి అనిపించేది. కానీ, అతను మద్యం సేవించిన రాత్రులలో ఆ గురక శబ్దం వినిపించేది కాదు. అందుకే ప్రతిరాత్రీ అతను మద్యం సేవించడం మొదలు పెట్టాడు. ఊర్మిళకి ఆ విషయంలో పెద్దగా అభ్యంతరమేమీ ఉండదు కాదు కానీ, కొదండరెడ్డికి మందుపై ఎక్కువ డబ్బు ఖర్చు పెట్టడం ఇష్టముండేదికాదు.

రాత్రిళ్ళు గడవడం అతనికి మరింత దుర్భరమవుతూ వస్తుండగా, ఒకరోజు, ఆఫీసులో అతనికి హఠాత్తుగా జ్ఞానోదయం కలిగింది. ఆపాత ఆఫీసులో, ఒక పాత ఫ్యాన్ కింద ఒక కొత్త జ్ఞానం ఉదయించిందన్నమాట. తలమీద తిరుగుతున్న ఫాన్‌చేసే "గరగర" శబ్దం అతనిని చాలా చిరాకు పుట్టిస్తుంది. మామూలుగా మధ్యాహ్నాలు నిద్రపోవడం ఇష్టంలేని ఆ ఇంజనీరుకు, ఒక్కొక్కరోజు భోజనానంతరం కుర్చీలో అలా వెనక్కు వాలి కళ్ళుమూసుకొని పది, పదిహేను నిముషాలపాటు అర్ధబోధావస్థలో ఉండడం అంత అరుదేమి కాదు. ఆ రోజు అలాంటి ఒక అర్ధసుషుప్తి నుంచి తుళ్ళిపడి నిద్రలేచేటప్పుడు, ఆజ్ఞానప్రకాశం అతని మస్తిష్కానికి ఒక అయిదువందల వాట్ల ఉత్తేజనం కలిగించింది. "ఈ ఫ్యాన్ ఇంత రొదపెడుతున్నా నా నిద్రకి అది విఘ్నం కాలేదే? ఏ శబ్దమయినా ఒకేరకంగా... అంటే అప్పుడప్పుడు గేర్ మారుస్తున్నట్టుగా కాకుండా... స్థాయి మారకుండా... ఒకే శృతిలో వింటుంటే, అది నిద్రాభంగం కలిగించరాదేమో!"

ఇక అతను సమయం వృథా చెయ్యలేదు. పగటి కలలు కంటూ నిద్రపోతున్న జీపు సారథిని మేల్కొల్పబడ్డాడు. జీపు వెళ్ళి ఆగింది, ఒక ఎయిర్ కూలర్ షాపు ముందు. రకరకాల ఎయిర్ కూలర్లని పరీక్షించి కోదండం, ఒకటి సెలక్ట్ చేసుకున్నాడు.

"సార్! మీకు ఇది బెడ్‌రూమ్‌కి కావాలన్నారు కదా! దీని ఫ్యాన్‌సైజ్ పెద్దది కావడం వలన శబ్దం కూడా ఎక్కువ వస్తుంది. దీని తరువాత సైజు అయితే, స్వీప్ ఇంతే వుంటుంది, కానీ, శబ్దం తక్కువగా వస్తుంది" అని షాప్‌వాడు చెబుతుండగా, "ఒరేయ్! బ్లడీఫూల్, నేను ఇది ఎందుకు కొంటున్నానో నీకే కాదు, నీ బాబుకి కూడా అర్థం కాదు" అని అతనికి చెప్పాలనిపించింది. కానీ... "నాకు ఇదే కావాలి" అని దాని ఖరీదు చెల్లించేశాడు. ఆ

షాపునుంచి ఒక మెకానిక్‌ని కూడా తీసుకువెళ్ళి తన ఇంటి బెడ్రూమ్ కిటికీలో ఈ న్యూసెన్స్ యంత్రాన్ని అమర్చినప్పుడు, అతనికి ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించినంత ఆనందం కలిగింది.

అరవ సినిమాల్లో ఆద్యంతం వినిపించే శబ్దాల గొడవ, ఆ చలువపెట్టెనుంచి అనవరతంగా రావడం గమనించి, "ఇంత పెద్ద శబ్దం వింటూ ఎవరయినా నిద్రపోగలరా?" అని ఊర్మిళ అడిగింది. ఏదో ఆలోచనలో మునిగిన కోదండం, ఎంటనే జవాబేమీ ఇవ్వలేదు. "ఇంత పెద్ద చప్పుడు కాదే, పిడుగు పడుతుంటే కూడా నిద్రపోవచ్చే. వర్షాకాలంలో ఉరుములు మెరుపులు ఉంటే కూడా జనం సుఖంగా నిద్రపోతారే. కానీ, నువ్వు దగ్గరుంటే, ఇంకెవ్వరికయినా నిద్ర వస్తుందో రాదో నాకు తెలియదు కానీ, నాకు మాత్రం నిద్రరాదు. ఒక్కొక్కరాత్రి నాకు కోపం ఎక్కువై, అది కోపం కాదు కానీ, భరించలేనట్టయ్యి నేను నిన్ను గిల్లడం, తట్టడం. పిడికిలితో కొట్టడం, ఇలాంటివన్నీ ప్రయోగం చేసిచూశాను. నీకు ఎక్కువ నొప్పి అనిపించినప్పుడు, కలవరింతగా విసుక్కుంటావు కానీ, నీ న్యూసెన్స్ అలా కొనసాగుతూనే ఉంటుంది. మళ్ళీ మళ్ళీ నేను నిన్ను నొప్పిస్తే, నువ్వు లేచి కూర్చుని నన్ను తిట్టి, మళ్ళీ కొద్ది క్షణాల్లో నీ కచేరీని కొనసాగిస్తావు. నిన్ను నేను తప్పు పట్టటం లేదు. కానీ, రాత్రంతా నాకు నిద్ర రాకపోతే, ఒక్కొక్కప్పుడు నిన్ను చంపాలని కూడా అనిపించేది. కానీ, ఇన్నాళ్ళ బట్టీ లేని జబ్బు నీకిప్పుడెలా పుట్టుకొచ్చిందని ఆలోచించి, నీకేదయినా దయ్యం పట్టిందేమోనని భయపడి నాకు ఏడుపొచ్చేది. పగలంతా మేకలా సౌమ్యంగా ఉండి, రాత్రి మాత్రం ఈ పులిగాండ్రింపు ఎలా వస్తుంది? నువ్వు చెబుతున్నావే, కొంతమంది స్త్రీలకు మెనోపాజ్ టైములో శరీరంలోని హార్మోన్ల మార్పుల వలన ఇదే కాదు, ఇంకా ఎక్కువ కూడా జరగవచ్చని కదా! ఇంతకంటే ఎక్కువ అంటే ఏమిటి? జ్ఞాపకశక్తి తగ్గడం లేకపోతే పిచ్చి ఎక్కడం. జ్ఞాపకశక్తి పోయినా, పిచ్చి ఎక్కినా ఫర్వాలేదు, కానీ, నువ్వు ఈ గురక విషయం మర్చిపోవడంలేదే. పిచ్చివాళ్ళు కూడా రాత్రిళ్ళు కమ్మగా నిద్రపోనిస్తారు. కానీ, నువ్వు రాత్రుళ్ళు నన్ను పిచ్చి వాడిని చేస్తున్నావు. దీనికేమిటి పరిష్కారం? ఈ జబ్బుకేమిటి మందు? ఎలాంటి నివారణా లేదా? కనీసం, మెనోపాజ్ తరువాతనయినా ఇది ఆగుతుందా? ఇది ఆగడానికి ఎంతకాలం పడుతుంది? ఇది ఆగేవరకూ నేనేం చేయాలి? నేను మంచి నిద్రలో ఉన్నా కూడా, నీ గురక అప్పుడప్పుడు నిద్రలేపుతుంది. నా ఆరోగ్యం చాలా క్షీణించిపోయింది. నాకు రాత్రి ఐదారు గంటలు నిద్రపోవడం చాలా అవసరం. దాని కొరకు నేనేం చేయడానికయినా సిద్ధమే. నువ్వన్నట్టు చాలామంది స్త్రీలు, పురుషులు గురకపెట్టడం సహజమే కావచ్చు. కొన్ని రోజులు చెవిలో దూది పెట్టుకొని పడుకోవడానికి కూడా ప్రయత్నించాను, నేను. ఎంత దూది పెట్టుకొన్నా కానీ, మరేమీ వినిపించకపోయినా, నీ గురక మాత్రం స్పష్టంగా వినిపిస్తుంది. అలా చెవిలో

దూది కుక్కేసుకోవడం వలన నాకు సరిగా ఊరిరాడనట్టుగా అనిపిస్తుంది. ఈ బతుకుకంటే చెవిటివాడిగా మారడమే మేలనిపిస్తోంది".. అలా దీర్ఘాలోచనలో పడిన కోదండం, భార్య మళ్ళీ అదే ప్రశ్నని అడగడంతో...

"దీని చలిగాలికి నువ్వు నిండా ముసుగుతన్ని నిద్రపోవచ్చు. తల కూడా కప్పుకోవడం వలన ఆ సౌండ్ కొంచెం తగ్గుతుందేమో! అప్పుడు నేను కూడా కాస్త నిద్రపోగలను." అని ఒక చిరునవ్వుతో చెప్పాడతను.

ఆ చిరునవ్వు ఊర్మిళలో మరొక చిరునవ్వుకు దారి తీయలేదు. "అయితే నా గురకకి ఇది విరుగుడా?" అని అడిగింది. కోదండం బిగ్గరగా నవ్వి, "అలాగే అనుకో" అన్నాడు.

ఆ రాత్రి చాలా సేపు వారిద్దరికి నిద్ర రాలేదు. కానీ, ఒకసారి నిద్రపట్టిన తరువాత, వారు మర్నాడు ఉదయం ఆలస్యంగా లేచారు. రాత్రంతా చాలా చలివేసింది. ఆ వేసవి కాలంలో కూడా వారికి బ్లాంకెట్ వాడాల్సి వచ్చింది. కొన్ని రోజుల్లో వాళ్ళకి ఆ కూలర్‌గోల అలవాటయిపోయింది.

మన ఎలక్ట్రిసిటీ బోర్డు సంగతి మీకు తెలుసు గదా! కరెంటు కోత వలన కొంతసేపు అవస్థపడితే, వారి కోతి పాలసీ వలన మిగతా సమయం కూడా అవస్థే.

కోదండరెడ్డి గారి ఇంజనీరు బుర్రలో దానికి జవాబుగా ఒక ఉపాయం తట్టింది. అది సిల్లీకావచ్చు, కానీ, సుగమం, ప్రాయోగికం.

ఒక టేపులో కూలర్ శబ్దం రికార్డు చేసి పెట్టండి. కరెంటు లేనప్పుడు బ్యాటరీతో పనిచేసే టేప్‌రికార్డర్ ఆన్ చేయండి. అది గంటన్నర సేపు పనిచేస్తుంది ఆ లోపల, కరెంటు తిరిగి రావచ్చు. ఒకవేళ రాకపోయినా, మంచినిద్రలో ఉంటే, తెల్లారేవరకూ, ఆ నిద్రకు భంగం కలగకుండా ఉండవచ్చును కదా!

కోదండోపదేశం, మరేమీ కాదు ప్రియమైన స్త్రీ పురుష పాఠకుల్లారా!... మీ పక్కన శయనిస్తున్న వ్యక్తిపెట్టే ఆ గురక వలన మీ జీవితాలు దుర్భరమైతే ఈ కూలర్ టెక్నిక్ ఒకసారి ప్రయోగించి చూడండి. ఒక గదిలో ఇద్దరికంటే ఎక్కువగా ఉంటే కూడా ఇబ్బంది ఉండదు, అయితే, అది ఒక లాభసాటి భేరమే అవుతుంది. ఒక్క కూలర్ చాలు, మీ బెడ్ రూములో ఏ శబ్దమూ చేయని ఎయిర్ కండిషనర్ ఉంటే, అది తీసి పారెయ్యండి. దానికి బదులుగా ఒక ఎయిర్ కూలర్‌ని ప్రతిష్టించండి. తరువాత మీరు సుఖంగా నిద్రపోవచ్చు. కరెంటు బిల్లు వచ్చేటప్పుడు మీకు హై.బి.పి రాదు కూడా.